
సాక్షి చిత్తూరు

శనివారం । 30 । మార్చి । 2024



మాయలోడు థామస్

టీడీపీ జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కులం, మతం, చదువులపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందాయి.

- IIలో



6 నుంచి వార్షిక పరీక్షలు

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఏప్రిల్ 6 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి.

- IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహర్ ఆదివారం (ఉ)
చిత్తూరు	6.30	4.49
పుంగనూరు	6.31	4.53

న్యూస్‌రీల్

మూల్యాంకనానికి హాజరు కావాల్సిందే



డీఈఓ దేవరాజు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి మూల్యాంకనం విధులకు కేటాయించిన టీచర్లకు ఎలాంటి మినహాయింపులు లేవని డీఈఓ దేవరాజు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 8వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం నిర్వహించనున్నట్టు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో మూల్యాంకనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టినట్టు పేర్కొన్నారు. ఈ మేరకు చీఫ్ ఎగ్జామినర్స్, అసిస్టెంట్ ఎగ్జామినర్స్, స్పెషల్ అసిస్టెంట్‌లకు ఉత్తర్వులు ఇచ్చామన్నారు. ఉత్తర్వులు అందుకున్న ప్రతి ఒక్కరూ విధులకు హాజరు కావాలని తెలిపారు. ఉత్తర్వులు పొందిన వారందరూ ఈ నెల 31 వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పీసీఆర్ పాఠశాలలో డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్‌కు రిపోర్టు చేసుకోవాలన్నారు. హాజరుకాని వారిపై శాఖాపరంగా చర్యలు తప్పవని డీఈఓ హెచ్చరించారు.

ఎంసీసీ ఉల్లంఘనలపై విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘనలపై జిల్లా ఎంసీసీ బృందం పకడ్బందీగా పర్యవేక్షించి సమగ్ర విచారణ చేస్తోంది. జిల్లాలో ఈ నెల 29వ తేదీన నమోదైన 5 ఎంసీసీ ఉల్లంఘనల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా విచారించారు. జీడీ నెల్లూరు మండలం, పాలసముద్రంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ ఆపరేటర్ ను విధుల నుంచి తప్పించారు. అలాగే మిగిలిన ఫిర్యాదులను సమగ్రంగా విచారించి ఆర్ఓల నుంచి రిపోర్టులు సేకరించారు. ఆ రిపోర్టులను జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి మురళీకృష్ణ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్‌కు నివేదికల రూపంలో పంపారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు



చిత్తూరులో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

చిత్తూరు అర్బన్: స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవడానికి పోలీసుశాఖ భరోసా ఇస్తోందని చిత్తూరు ఎస్పీ జాషువా ఓ ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రతిరోజూ జిల్లాలో పోలీసుల ద్వారా కవాతు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. జిల్లాకు ఇప్పటి వరకు మూడు కంపెనీల సహస్త్ర సీమా బల్, ఓ సీఆర్‌పీఎఫ్ బలగాలు కేటాయించినట్టు తెలిపారు. కాగా శుక్రవారం చిత్తూరు నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ ఉలసయ్య, ఎస్ఐ ప్రసాద్.. కుప్పంలోని గుడుపల్లెలో ఎస్ఐ లక్ష్మీకాంత్‌లు కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారని తెలిపారు. ప్రజలు నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవడానికి పోలీసుశాఖ తగిన రక్షణ కల్పిస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.

టీడీపీ వేధింపులతోనే రాజీనామా



రాజీనామా పత్రాలను చూపుతున్న కొలమాసనపల్లి పంచాయతీ వలంటీర్లు

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీకి చెందిన 31 మంది వలంటీర్లు శుక్రవారం మూకుమ్మడిగా రాజీనామా చేసి ఆ పత్రాలను స్థానిక ఎంపీడీఓ విద్యాసాగర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు సెల్వరాజ్, నెల్సన్, మధు, నరేంద్ర, న్యామత్‌లు మాట్లాడుతూ తాము ప్రజలకు సేవ చేయాలని ఇందులోకి వచ్చామన్నారు. కానీ తమపై శ్రీకాళహస్తి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి స్లీపర్‌సెల్స్, టెర్రరిస్టులుగా అభివర్ణించడం చాలా బాధేసిందన్నారు. తాము కేవలం విధులు మాత్రమే నిర్వహించుకుంటూ ఉంటే టీడీపీ, జనసేన నాయకులు తమపై లేనిపోని రాద్ధాంతం చేసి అవమానించడం వల్లే తాము రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో ఇన్నాళ్లు తమకు గౌరవం ఇచ్చి ప్రోత్సహించిన వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గోవిందు స్వామి, నాయకులు మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బేరం కుదిరింది!

టికెట్లు ఆశించి భంగపడిన నేతల 'కోట్లా'ట ఇప్పుడు ఉమ్మడి జిల్లాలో హాట్‌టాపిక్‌గా మారింది. ఇన్నాళ్లు పార్టీ జెండా మోశాం.. సొంత డబ్బులు వెచ్చించి పార్టీ ఉనికిని కాపాడాం.. అంటూ గొప్పలు చెప్పుకున్న టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు ఆపై టికెట్ రాకపోవడంతో తీవ్ర నైరాశ్యంలో మునిగిపోయారు. ఆయా పార్టీల అధినేతల తీరుపై కొన్ని రోజులు రుసరుసలాడారు. రహస్య సమావేశాలు, ఎత్తుకుపైఎత్తులు వేస్తూ రహస్య అజెండా నడిపారు. ఆపై బేరం కుదడంతో ఇప్పుడు పార్టీ సిద్ధాంతాలు.. కట్టుబాట్ల గురించి వల్లెవేస్తున్నారు. టికెట్ ఆశించి భంగపడిన నేతలకు పెద్ద మొత్తంలోనే ముడుపులు అందాయని ఆయా పార్టీల నేతలే బహిరంగంగా చెబుతున్నారు.

- టికెట్ దక్కలేదని ఆందోళనలు
- రహస్య సమావేశాలు, ఏడుపులతో హంగామా
- బేరం కుదిరాక సానుకూలంగా ప్రకటనలు
- మాజీలు ఒక్కొక్కరికి రూ.5 కోట్లిచ్చిన కూటమి అభ్యర్థులు
- కార్యకర్తలు, నాయకులకు మొండిచేయి
- చిల్లర నేతతో కుదరని డీల్
- 'అక్రమ' సొమ్మును ఖర్చుచేస్తున్న వైనం



సాక్షి, తిరుపతి : సార్వత్రిక ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన నాయకులు, ప్రస్తుత కూటమి అభ్యర్థుల మధ్య బేరం కుదిరింది. భారీ ఎత్తున నగదు, బహుమతులు అందడంతో అసంతృప్తి నాయకులు ఆందోళనలను పక్కనపెట్టారు. ఆశావహుల కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేసిన కార్యకర్తలకు మాత్రం మొండి చేయి చూపించారు. ఏమైందని అడిగితే.. అధిష్టాన నిర్ణయమే శిరోధార్యమంటూ ప్రకటనలు ఇచ్చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తులు, పైరవీలు, ప్యాకేజీల కారణంగా పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు తారుమారయ్యాయి. చిత్తూరు, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని ఇటు టీడీపీ, అటు బీజేపీ, జనసేన శ్రేణులు భావించారు. ముందు నుంచి తనకే టికెట్ వస్తుందని భావించిన నాయకులందరికీ అధినేతలు హ్యాండిచ్చారు. తిరుపతి అసెంబ్లీ టీడీపీకే అనుకున్నారు. కానీ పొత్తులో భాగంగా జనసేన దక్కించుకుంది. చిత్తూరు అసెంబ్లీ టికెట్ మొదటి నుంచి బలిజ సామాజిక వర్గం వారికి ఇస్తారని భావించారు. చంద్రబాబు తన సామాజిక వర్గం వ్యక్తికి ఇచ్చి 'కమ్మ'ని ప్రేమ చాటుకున్నారు. అదే విధంగా చిత్తూరు పార్లమెంట్ స్థానానికి టీడీపీ నాయకులు తమలో ఎవరో ఒకరికి ఇస్తారని భావించారు. స్థానికేతరునికి కేటాయించి చిత్తూరు నాయకుల ఆశలపై నీళ్లు చల్లారు. గంగాధరనెల్లూరు మొదటి నుంచి పార్టీ కోసం పనిచేసిన వారిని అభ్యర్థిగా ప్రకటిస్తారని భావించారు. చెన్నైలో స్థిరపడిన డాక్టర్ థామస్ ఆర్థిక బలాన్ని చూసి ఆయనకు కట్టబెట్టారు. పొత్తులో భాగంగా నగరి బీజేపీకి ఇస్తారని భావించి ఆశోక్ రాజు కమలం కండువా కప్పుకున్నారు. బాబు 'కమ్మ'ని ప్రేమతో గాలి భానుకే కట్టబెట్టారు. సత్యవేడులో మొదటి నుంచి జెండా మోసిన వారెవ్వరినీ కాదని అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యే ఆదిమూలాన్ని అభ్యర్థిగా ప్రకటించారు. పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి బీజేపీకి లేదా జనసేనకు దక్కుతుందని ఓ వైపు కోలా ఆనంద్, మరో వైపు వినుత ఎదురుచూశారు. మరో వైపు మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు టీడీపీ అభ్యర్థి తానేనని, అందుకే టీడీపీలో చేరానని చెప్పుకుంటూ వచ్చారు. సత్యవేడు టీడీపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యేలు హేమలత, తలారి ఆదిత్యతోపాటు జేడీ రాజశేఖర్ ఆశించారు. వీరెవ్వరినీ కాదని వైఎస్సార్‌సీపీ వద్దనుకున్న ఎమ్మెల్యే ఆదిమూలానికి టికెట్ ఇచ్చి టీడీపీ కోసం మొదటి నుంచి కష్టపడ్డ వారికి హ్యాండ్ ఇచ్చారు. సూళ్లూరుపేట టికెట్ తమకేనని నెలవల సుబ్రమణ్యం, పరసా వెంకటరత్నం చెప్పుకుంటూ వచ్చారు. చివరకు నెలవల కుమార్తెను అభ్యర్థిగా ప్రకటించారు.

నాడు రేషన్ కార్డు ఇపించలేకపోయావ్.. నీకు మద్దతు ఇవ్వను పో

టీడీపీ హయాంలో అవమాన పడిన నియోజక వర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు పార్టీకి, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండడంతో వారిని తమ వైపు తిప్పుకునేందుకు కూటమి నేతలు ప్రయత్నాలు ప్రారంభించారు. ముందుగా వారికి ఫోన్‌చేసి బుజ్జగించే పనిలో పడ్డారు. ఇటీవల తూర్పు నియోజక వర్గాల పరిధిలోని ఓ స్థాయి నాయకుడి నివాసానికి టీడీపీ అభ్యర్థి వెళ్లి పలు కరించి బుజ్జగించే ప్రయత్నం చేశారు. 'నాడు అధికారంలో ఉన్నప్పుడు రేషన్ కార్డు, పింఛను కోసం ఎన్నిసార్లు తిరిగినా పనిచేయలేదు. నాకు చేయకపోగా, వేరొకరికి మాత్రం చేసిపెట్టావు. నా ఊర్లో కనీసం ఒక్కడికీ రేషన్ కార్డు, పింఛను ఇప్పించలేని వాడిని నేను మీకు ఎందుకు మద్దతు ఇవ్వాలి. మీ అవసరం నాకొద్దు. నా మద్దతు నీకు ఇవ్వను పో' అని ఘాటుగా సమాధానం ఇచ్చినట్టు తెలిసింది. ఈ సారి మద్దతు ఇస్తే.. ఇకపై అలా జరగదు, నీకు ఇప్పుడు ఏం కావాలో చెబితే చేస్తాను. అధికారం వస్తే పెత్తనం అంతా నీకే ఇప్పిస్తాను' అని సదరు అభ్యర్థి హామీ ఇచ్చినట్టు సమాచారం. అభ్యర్థి మాటలు నమ్మని ఆ నాయకుడు ఆలోచించుకుని చెబుతాను అని చెప్పి పంపేయడం కొసమెరుపు.

అసంతృప్తులు, అభ్యర్థి మధ్య కుదిరిన డీల్

ఓటమి భయంతో పొత్తులు పెట్టుకున్న చంద్రబాబు నమ్మిన వారిని నట్టేటముంచడంతో టికెట్ ఆశించి భంగపడ్డ వారంతా ఎదురు తిరిగారు. నిజాయితీగా పార్టీ కోసం పనిచేసిన మస్తాన్‌యాదవ్ లాంటి వారు టీడీపీకి రాజీనామా చేశారు. మరి కొందరు ప్యాకేజీల కోసం బెదిరించి, భయపెట్టి డబ్బు తీసుకుని సైలెంట్‌గా ఉంటున్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు అక్రమంగా సంపాదించిన సొమ్మును నేడు ఎన్నికల కోసం విచ్చలవిడిగా ఖర్చుచేస్తున్నారు. అందులో భాగంగా కూటమిలోని అసంతృప్త నాయకులకు నగదు, విలువైన బహుమతులు ఇచ్చి నోరెత్తకుండా చేశారు. వారిని నమ్ముకుని ఆందోళనలు చేసిన కార్యకర్తలకు రూపాయి కూడా ఇవ్వలేదని విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి జిల్లాలో మాజీ ప్రజా ప్రతినిధులకు భారీగానే నగదు ముట్టజెప్పినట్లు కూటమి నాయకులే బహిరంగంగా చెప్పుకుంటుంటున్నారు. కొన్నేళ్లుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న మాజీల నివాసాలకు వెళ్లి మరీ కండువా కప్పి తమకు మద్దతు ఇచ్చినట్లు తమ ఎల్లో మీడియాలో పెద్ద పెద్ద అక్షరాలతో ప్రచారం చేయించుకుంటున్నారు. తిరుపతి, చిత్తూరు జిల్లాలో దాదాపు 15 మంది వరకు మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో ఐదారుగురికి ఒక్కొక్కరికి రూ.5 కోట్ల చొప్పున ముడుపులు ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఓ మోస్తరు మాజీలకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లు ఇచ్చి మద్దతు కోరినట్లు సమాచారం. తిరుపతికి చెందిన ఓ చిల్లర నాయకుడు మాత్రం రూ.2 కోట్లు చాలవని రూ.5 కోట్లు రాబట్టుకునేందుకు ఇంకా భీష్మించుకుని మధ్యస్తాలు నెరుపుతున్నాడు.

వలంటీర్లకు క్షమాపణ చెప్పాల్సిందే

- డెప్యూటీ సీఎం కే.నారాయణస్వామి డిమాండ్



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం కే.నారాయణస్వామి

పాలసముద్రం : నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లను టెర్రరిస్టులుగానూ, సంఘ విద్రోహ శక్తులతో పోలుస్తూ టీడీపీ, జనసేన నాయకులు విమర్శించడం దారుణమని, వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని డెప్యూటీ సీఎం నారాయణస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన పార్టీ కార్యకర్తలతో కలిసి మండలంలోని దీనబంధుపురం, గంగమ్మపురంలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఎక్కడా లేనివిధంగా వలంటీర్లు ప్రజలకు సేవ చేస్తున్నట్టు వెల్లడించారు. కరోనా విపత్తు సమయంలో ప్రజలకు సేవ చేసింది వలంటీర్లు కాదా..? అని ప్రశ్నించారు. అవ్వాతాతలకు పెన్షన్ పంపిణీ నుంచి విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ల వరకు సేవ చేస్తున్న వలంటీర్లను ఘోరంగా అవమానించడం దారుణమన్నారు. చంద్రబాబునాయుడు, తన సొంత పుత్రుడు, దత్తపుత్రుడు కంటున్న కలలు నెరవేరవని ఎద్దేవా చేశారు. ఈ సారి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. పేదలకు, పెత్తందారుల మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో ప్రజలు వివేకంతో ఆలోచించి ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ తులసీయాదవ్, జెడ్పీటీసీ సభ్యుడులు అన్బలగన్, రైతు భరోసా చైర్మన్ పోలయ్య, నాయకులు చంద్రశేఖర్‌రాజు, షణ్ముగరెడ్డి, వాసురాజు, సుమన్, ధనంజయులు, గోపాల్, లోకిదాస్, రాజామణి, గోపి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపాదం

- ఎన్నికల వేళ .. తాయిలాలకు అడ్డుకట్ట
- డబ్బు, మద్యం నిరోధించడంపై పోలీసుల దృష్టి
- ఇటీవల భారీగా పట్టుబడుతున్న నగదు, నగలు
- సరైన పత్రాలు, రశీదులు లేకుంటే ఇబ్బందులే



చిత్తూరులో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

చిత్తూరు అర్బన్: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నోటిఫికేషన్ రావడానికి నెల రోజుల ముందు నుంచే అక్రమాలపై నిఘా ఉంచింది. తాయిలాలు, నగదుపై ఉక్కుపాదం మోపేవిధంగా చర్యలు ముమ్మరం చేసింది. ఇప్పటికే జిల్లాలో ఎన్నికల ప్రవర్తన, నియమావళి అమల్లోకి రావడంతో పోలీసులు, అధికారులు సంయుక్తంగా అణువణువు జల్లెడ పడుతున్నారు. స్పష్టమైన రశీదులు లేకుండా తీసుకెళుతున్న నగదు, ఆభరణాలను అధికారులను స్వాధీనం చేసుకుంటున్నారు. మద్యం లాంటి వాటిని తీసుకెళితే క్రిమినల్ కేసులు పెడుతున్నారు.

బోర్డర్ చెక్‌పోస్టుల్లో అప్రమత్తం

చిత్తూరు సరిహద్దులు అంతర్రాష్ట్ర జిల్లాలకు దగ్గరగా ఉండడంతో ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసేలా తాయిలాలు తీసుకురావడం సులభతరమవుతోంది. దీంతో జిల్లా సరిహద్దులను ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఇందులో ఏపీ-కర్ణాటక చెక్‌పోస్టులు 5, ఏపీ-తమిళనాడు చెక్‌పోస్టులు 9 ఉన్నాయి. ఇవికాకుండా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) చెక్‌పోస్టులు 2, అటవీశాఖకు చెందిన రెండు చెక్‌పోస్టులు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలోకి ప్రవేశించే ప్రతి ఒక్క వాహనాన్ని పోలీసులు తనిఖీ చేస్తున్నారు. పోలీసులతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్, ఎంసీసీ, రెవెన్యూ, నిఘా విభాగాలు వీటిపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించాయి. 24 గంటల పాటు పోలీసులు ఇక్కడ విధులు నిర్వర్తిస్తూ అప్రమత్తంగా ఉన్నారు. పరిమితికి మించి నగదు, బంగారు ఆభరణాలు, చీరలు, వెండి వస్తువులు, క్రీడా పరికరాలు తీసుకెళితే జప్తు తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. చిత్తూరు, గుడిపాల మండలాల్లోని చెక్‌పోస్టుల వద్ద ఇటీవల పోలీసులు పెద్ద మొత్తంలో నగదు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసకున్న విషయం తెలిసిందే.

నిబంధనలు ఇలా..

మరోవైపు ఎన్నికలవేళ సాధారణ పౌరులు పాటించాల్సిన నియమావళిపై జిల్లా ఎన్నికల అధికారి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. దీని ప్రకారం పౌరులు ఒకేసారి రూ.50 వేలకు తక్కువ మొత్తం మాత్రమే నగదు కలిగి ఉండాలి. ఈ మొత్తం ప్రయాణ సమయంలో తీసుకెళ్లేటప్పుడు బ్యాంకు లావాదేవీల వివరాలు, మొబైల్‌కు వచ్చిన ఎస్ఎంఎస్ చూపించాలి. డబ్బు ఎందుకు తీసుకెళుతున్నారో తప్పనిసరి కారణం చెప్పాలి. ఆస్పత్రి, చికిత్స కోసం రూ.50 వేల కన్నా ఎక్కువ మొత్తం తీసుకెళ్లేప్పుడు సరైన పత్రాలు చూపాలి. అలాకాని పక్షంలో ఆన్‌లైన్ లావాదేవీలు, నిఫ్ట్ ద్వారా నగదు బదిలీ చేసుకోవాలి. ఉద్యోగులు, కార్మికులు, కూలీలు పెద్ద మొత్తంలో నగదు చెల్లించాల్సి వచ్చినపుడు బ్యాంకు లావాదేవీలు, ఉద్యోగుల వివరాలు ఉండాల్సిందే. రైతులు వ్యసాయం, ఇంటి అవసరాల కోసం, క్రయవిక్రయాలు జరిపి నగదు తీసుకెళ్లేప్పుడు మీ-సేవ కేంద్రాల్లో నమోదు చేసుకున్న స్లాట్ వివరాలు చూపించాలి.

సరైనదైతే తీసుకోవచ్చు

తనిఖీల సమయంలో ఎలాంటి పత్రాలు చూపకుంటే అధికారులు నగదు, నగలు స్వాధీనం చేసుకుంటారు. తరువాత ఇంటికెళ్లి రశీదులు తీసుకొచ్చి అధికారులు స్వాధీనం చేసుకున్న వాటిని తిరిగిపొందే అవకావం ఉంది. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా త్రీమెన్ కమిటీ ఎదుట సీజ్ చేసిన నగదు, ఆభరణాలకు సంబంధించిన ధ్రువపత్రాలు, బ్యాంకు రశీదులు, బిల్లులు అందజేయాలి. కమిటీలో జెడ్పీ సీఈవో, జిల్లా ఆడిట్ అధికారి, ఖజానాశాఖ నుంచి ముగ్గురు అధికారులు ఉంటారు. సంబంధిత నగదు, వస్తువుల యజమాని అందచేసిన పత్రాలన్నింటినీ కమిటీ సభ్యులు పరిశీలించి సక్రమంగా ఉంటే సీజ్ చేసిన వాటిని తిరిగిచ్చేస్తారు.



ఇటీవల పోలీసులు స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులు

జిల్లాలో ఇప్పటి వరకు పట్టుబడ్డ నగదు, ఇతర వివరాలు	
నగదు	రూ.1.63 కోట్లు
బంగారు	4.87 కిలోలు
వెండి	03 కిలోలు
మద్యం	6,187 లీటర్లు
సారా	2,583 లీటర్లు

ఉపేక్షించం



ప్రశాంత ఎన్నికలు జరిపించడానికి పోలీసుశాఖ అన్ని చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడంతో పాటు 24 గంటల పాటు అక్కడ పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. డబ్బు, వివాహ శుభకార్యాలకు ఆభరణాలు తీసుకెళ్లేవాళ్లు తప్పనిసరిగా రశీదులు, బ్యాంకు లావాదేవీలను తనిఖీల్లో చూపించాల్సిందే. మద్యం, ఓటర్లను ప్రభావితం చేసే వస్తువులు జిల్లాలోకి తీసుకొస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద కేసులు కూడా నమోదుచేస్తాం.

– పీ.జాషువ, ఎస్పీ, చిత్తూరు

బాబు హేళన..డ్రైవర్ల ఆగ్రహం

- డ్రైవర్లపై నోరుపారేసుకున్న చంద్రబాబు
- శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి టిప్పర్ డ్రైవర్ అంటూ అవమానం
- వెంటనే క్షమాపణ చెప్పాలని డ్రైవర్ల సంఘం డిమాండ్
- లేకుంటే బాబుకు బుద్ధి చెబుతామని ప్రతిన

చంద్రబాబునాయుడుకు పేదలంటే గిట్టదు. దళితులన్నా, బడుగు, బలహీన వర్గాలన్నా పడదు. అందుకే బహిరంగ సభలు, సమావేశా ల్లో వారిని హేళనగా మాట్లాడేస్తుంటారు. సాక్షాత్తూ అసెంబ్లీలోనే 'ఎస్సీలుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా..?' అంటూ దళితులను అవమానపరిచారు. ఆపై నాయీ బ్రాహ్మణులను తన దరికి చేరకుండానే కించపరిచి వెలుపులకు పంపేయడం గతంలో చర్చనీయాంశమైంది. ఇప్పుడు ఎడమచేత్తో వేలిముద్రలేసేవారు టిప్పర్ డ్రైవర్లంటూ శింగనమల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని ఉద్దేశించి చులకనగా మాట్లాడడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై జిల్లాలోని డ్రైవర్లు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. దళితులు వేలిముద్రగాళ్లని, డ్రైవర్లని నోటికొచ్చినట్టు మాట్లాడితే సహించేది లేదని మండిపడుతున్నారు. రాబోయే ఎన్నికల్లో బాబుకు రాజకీయ సమాధి కట్టడం ఖాయమని ప్రతినబూనుతున్నారు. వెంటనే డ్రైవర్లందరికీ బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆందోళన తప్పని హెచ్చరిస్తున్నారు.

– చిత్తూరు రూరల్/బైరెడ్డిపల్లి/నగరి

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి



రాజకీయాల్లోకి ఎవరైనా ప్రవేశించవచ్చు. డ్రైవర్లకు ఆ అర్హత లేదా...? మా ఉన్నతి ఆయనకు పట్టదా..? ఎన్నికల ప్రసంగంలోనే డ్రైవర్లను ఇంత చులకనగా మాట్లాడితే రేపు అధికారంలోకి వస్తే డ్రైవర్లను మరింత హీనంగా చూస్తారేమో. చంద్రబాబుకు భేషరత్తుగా క్షమాపణ చెప్పాలి.

– మహేష్, ట్యాక్సీడ్రైవర్, ఓజీ కుప్పం, నగరి మండలం

బాబుకు భవిష్యత్ లేదు



చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం పార్టీలతో జతకట్టడమే తెలు సు. సామాన్యులంటే ఆయనకు అలుసు. రాజకీ య లబ్ధి కోసమే పేద ప్రజలు నా దేవుళ్లంటూ కపట ప్రేమ చూపిస్తారు. టిప్పర్ డ్రైవర్ అంటూ చులకన చేసి మాట్లాడడం సరికాదు. ఈసారి ఎన్నికలో చంద్రబాబుకు డ్రైవర్లు బుద్ధి చెప్తారు.

–జ్ఞానశేఖర్, ఆటో, కారు డ్రైవర్, చిత్తూరు

డ్రైవర్లంతా రోడ్డెక్కుతాం



రాష్ట్రంలోని డ్రైవర్లంతా రోడెక్కితే తినే తిండికి కూడా తిప్పలే. ఎక్కడికక్కడికి బండ్లు ఆపేసి చంద్రబాబుపై యుద్ధం ప్రకటిస్తాం. అప్పుడు తెలుస్తుంది డ్రైవర్ల సత్తా ఏమిటో. డ్రైవర్లను హేళన చేసి మాట్లాడడం కరెక్ట్ కాదు. చంద్రబాబు క్షమాపణ చెప్పాలి.

–త్యాగరాజులు, టిప్పర్‌డ్రైవర్, గుడిపాల

మా సత్తా ఏంటో చూపిస్తాం



చంద్రబాబు డ్రైవర్లను హేళన చేసి మాట్లాడితే ఊరుకోం. గతంలో ఎస్సీగా ఎవరైనా పుడతారా? అని చులకన చేశారు. అందుకే 2019లో ఎస్సీలు బుద్ధి చెప్పా రు. నాయీ బ్రహ్మణులను ఇంటి గేటు దాటించారు. ఇప్పుడు డ్రైవర్లను హేళన చేశారు. మా సత్తా చూపిస్తాం.

–చిట్టిబాబు, ఆటోడ్రైవర్, చిత్తూరు

డ్రైవర్ విలువ తెలుసా బాబు?



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు డ్రైవర్ లేకుండా ఎక్కడికైనా వెళ్లగలడా.. డ్రైవర్ విలువ తెలిసి కూడా డ్రై వర్లను హేళన చేస్తూ మాట్లాడడం సమంజసం కాదు. పేదలకు ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తే తప్పేంటి. డ్రైవర్లను చులకన చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

-శ్రీనివాస్, డ్రైవర్, బైరెడ్డిపల్లి

డ్రైవర్‌కు టికెట్ ఇవ్వడం నేరమా?



ధనికునికంటే పేదలకే కష్ట సుఖాలు బాగా తెలుసు. ప్రజల కష్టాలను బాగా అర్థం చేసుకోగలరు. డ్రైవర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం నేరమా. పేపర్ బాయ్ నుంచి రాష్ట్రపతి వరకు ఎదిగిన వారు ఉన్న మన దేశంలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తే తప్పవుతుందా..?. డ్రైవర్లను చులకన చేస్తే గుణపాఠం చెబుతాం.

-అమరనాథరెడ్డి, టిప్పర్ డ్రైవర్, బైరెడ్డిపల్లి

తీవ్రంగా ఖండిస్తున్నాం



డ్రైవర్లను హేళన చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. డ్రైవర్లు ఎమ్మెల్యేలు కాకూడదా..?. టిప్పర్ డ్రైవర్‌ని వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ప్రకటించి డ్రైవర్లకు సముచిత స్థానం కల్పిస్తే.. చంద్రబాబు నాయుడు మా వృత్తిని కించపరిచేలా మాట్లాడడం ఆయన అహంకారానికి నిదర్శనం. నేను కూడా డ్రైవర్‌నే. నాకు ఎంపీటీసీగా అవకాశం ఇచ్చారు. ఆపై వైస్ ఎంపీపీ హోదా కల్పించారు. – కన్నియప్ప, వైస్ ఎంపీపీ, నగరి మండలం

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాల అభిషేకపూజలను నేత్రపర్వంగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం రాహుకాల సమయంలో సంప్రదాయబద్ధంగా అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగురంగుల పూలతో అమ్మవారిని ముస్తాబు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.


గడువు పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ఏపీ మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పొడిగించినట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024-25వ విద్యాసంవత్సరంలో జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతిలో చేరేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అర్హత గల విద్యార్థులు ఏప్రిల్ 6వ తేదీలోపు www.apms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మాయలోడు థామస్?

'డబ్బుంటే సుబ్బిగాడినే సుబ్బరావుగారంటారు
ధనముంటే అప్పలమ్మనే అప్సరసని పొగిడేస్తారు
కాషే ఉంటే ఫేస్‌కు విలువస్తుంది
నోటే ఉంటే మాటకు బలమొస్తుంది..' ఇది ఓ తెలుగు సినిమాలో ఫేమస్ పాట. అచ్చం ఇలాంటిదే జీడీనెల్లూరు నియోజకవర్గంలో చోటుచేసుకుంది. టీడీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న వీ.ఎం.థామస్ కులం, మతం, చదువులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటర్మీడియెట్ టీసీలో వీ.మునస్వామిగా ఉన్న ఆయన పేరు ఆ తర్వాత కొంత కాలానికి వీ.ఎం.థామస్‌గా మారిపోవడం వెనుక ఆంతర్యమేమిటో అంతుపట్టడంలేదు. ఇక ప్రపంచ ప్రఖ్యాత సంతాన సాఫల్య వైద్యునిగా పేరు గడిస్తున్న ఆయన చదువుపైనా హిందూ ధర్మ పరిరక్షణ సమితి నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు నిజనిజాలు నిగ్గు తేల్చాలని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

- మునస్వామి.. థామస్ ఎలా అయ్యారు?
- జీడీనెల్లూరు టీడీపీ అభ్యర్థి మతం, విద్యార్హతపై ఫిర్యాదులు
- ఇంటర్మీడియెట్ టీసీలో మునస్వామి.. కులధ్రువీకరణ పత్రంలో మునస్వామి థామస్
- అమాయక ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపణ
- సమగ్ర విచారణకు ఆదేశించిన జిల్లా ఎన్నికల అధికారి




మునస్వామి పేరుతో ఉన్న ఇంటర్మీడియెట్ టీసీ, మునస్వామి థామస్ పేరుతో ఉన్న కులధ్రువీకరణ పత్రం






మాట్లాడుతున్న మునస్వామి (థామస్) తల్లి రాణి, జీడీ నెల్లూరు టీడీపీ అభ్యర్థి మునస్వామి (థామస్)

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని గంగాధరనెల్లూరు నియోజకవర్గం టీడీపీ తరఫున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మునస్వామి (థామస్) 1990–91లో కార్వేటినగరం మండల కేంద్రంలోని ఆర్‌కేఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశారు. ఆ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా పోటీచేయబోతున్న ఆయనపై పలు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మునస్వామి మతం, విద్యార్హతలు, నేరచరిత్రపైన సమగ్ర విచారణ చేయాలని హిందూ ధర్మ పరిరక్షణ సమితి కన్వీనర్ మిట్టపల్లి సతీష్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. ఇంటర్మీడియెట్ కోర్సు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ)లో వీ.మునస్వామిగా ఉన్న వ్యక్తి ప్రస్తుతం ఉన్న పాస్‌పోర్టు, కులధ్రువీకరణ పత్రంలో వీ.మునస్వామి థామస్‌గా ఎలా అయ్యారనే విషయాన్ని సమగ్ర విచారణ చేయించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎంబీబీఎస్ చేయకున్నప్పటికీ డాక్టర్‌గా చెలామణి అవుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం థామస్ అనే క్రిస్టియన్ పేరు మీద చెలామణి అవుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. థామస్ పేరులోనే క్రిస్టియానిటీ ఉందని, కావున అతని ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని రద్దు చేసి, థామస్ నామినేషన్‌ను తిరస్కరించి, ఎన్నికల్లో అనర్హత వేటు వేయాలని ఫిర్యాదులో డిమాండ్ చేశారు.

తప్పుడు పత్రంతో ఎన్నికల్లో పోటీ

క్రైస్తవ మతం స్వీకరించిన థామస్‌కు ఎస్సీ రిజర్వేషన్ వర్తించదని ఫిర్యాదులో పేర్కొన్నారు. మతం మారిన ఎస్సీలను బీసీలుగా గుర్తించాలని చట్టం చెబుతోందన్నారు. అయినప్పటికీ ఆయన తప్పుడు కులధ్రువీకరణ పత్రం సమర్పించి ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధపడుతున్నారన్నారు. ఆయన ఎంబీబీఎస్ చదవక పోయినా పీహెచ్‌డీని అడ్డుపెట్టుకుని డాక్టర్‌గా చలామణి అవుతూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. తను ప్రపంచ ప్రఖ్యాత సంతాన సాఫల్య వైద్యునిగా ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అలాగే ఆయన నేర చరిత్ర కలిగిన వ్యక్తి అని, 2017లో తన వద్ద డాక్టర్‌గా పనిచేసి మానేసిన డాక్టర్ ఎస్.రమ్యను హత్య చేయడానికి ప్రయత్నించారనే ఆరోపణలున్నాయన్నారు. ఆ కేసులో ఆయనతో పాటు ఆరుగురు అరెస్టు కాగా, తరువాత ఆ కేసు ఏమైందో తెలియడం లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా కులధ్రువీకరణపత్రం

2022లో కార్వేటినగరం మండలంలో పనిచేసిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండానే నిబంధనలకు వ్యతిరేకంగా థామస్‌కు కుల ధ్రువీకరణ పత్రం జారీచేశారని తెలిసింది. 2022లో కార్వేటినగరం తహసీల్దార్‌గా పనిచేసిన షబ్బీర్‌బాషా 26–04–2022న వీ.మునస్వామికి వీ.మునస్వామి థామస్ అని కులధ్రువీకరణ పత్రం ఎలా ఇచ్చారు?.. కులంపై వివాదం వచ్చినపుడు సంబంధిత గ్రామంలో నలుగురిని అడిగి పంచనామా చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా కులధ్రువీకరణ పత్రం ఎలా జారీచేశారని ఫిర్యాదుదారులు ప్రశ్నిస్తున్నారు. థామస్ మత మార్పిడి విషయాన్ని సమగ్రంగా విచారణ చేయాలని జై హిందుస్థాన్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అక్కిలిగుంట మధు ఈనెల మార్చి 15న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన అందజేసిన వినతిలో సహజంగా పాస్ పోర్టు మంజూరు సమయంలో ఒక అక్షరం తప్పు ఉన్నా అధికారులు ఆమోదించరన్నారు. అలాంటిది మునస్వామి థామస్ అని పాస్‌పోర్టులో పొందారన్నారు. పేరు మార్చుకోవాలంటే గెజిట్ నోటిఫికేషన్ ఉండాలని, మతం మార్చుకుని ఉంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. కాబట్టి పాస్‌పోర్టు సమయంలో మత మార్పిడి ధ్రువీకరణ పత్రం, గెజిట్ నోటిఫికేషన్ సమర్పించి ఉంటారని, సంబంధిత కార్యాలయం నుంచి నివేదిక తెప్పించుకుని విచారణ చేయాలని ఆ ఫిర్యాదులో కోరారు.

వీటిపై సమగ్ర విచారణ

1. ఇంటర్ సర్టిఫికేట్‌లో వీ.మునస్వామి అని ఉన్న పేరు, పాస్‌పోర్టులో వీ.ఎం.థామస్‌గా ఎలా మారింది?
2. ఆయన జన్మస్థలం అల్లాగుంటని టీసీలోనూ, చెన్నై అని పాస్‌పోర్టులోనూ పేర్కొన్నారు. ఇందులో ఏది నిజం?
3. ఆయన వైద్యశాస్త్రం చదివారా..? లేక డాక్టరేట్ పొందిన వ్యక్తా?
5. ఆయనపై ఉన్న హత్యా ప్రయత్నం కేసు ఏమైంది. విచారణ కొనసాగుతోందా..? లేక కేసు కొట్టి వేశారా?

పకడ్బందీగా విచారణ



ఆధార్ కార్డులో వీ.ఎం, థామస్ అని ఉంది. ఏప్రిల్ 2022లో పనిచేసిన తహసీల్దార్ జారీచేసిన కులధ్రువీకరణ పత్రంలో వీ.మునస్వామి థామస్ అని జారీచేశారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నుంచి అందిన ఫిర్యాదులను సమగ్రంగా విచారిస్తున్నాం. ఆ ఫిర్యాదులకు సంబంధించిన రుజువులను పంపుతాం. ఈ ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేసి వాస్తవాలు తెలుసుకుంటాను.

– పుష్పకుమారి, తహసీల్దార్, కార్వేటినగరం మండలం

వైఎస్సార్‌సీపీలోకి కొనసాగుతున్న వలసలు



వైఎస్సార్‌సీపీలో చేరిన శివాజీనగర్ టీడీపీ యువత

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీలోకి వలసలు కొనసాగుతున్నాయి. శుక్రవారం రామకుప్పం మండలం, శివాజీనగర్ చెందిన 20 మంది యువకులు ఎమ్మెల్యే, స్థానిక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో యువకులకు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చలపతి మెకానిక్, నాగరాజు, ప్రకాష్, రామాంజనేయులు, భరత్, సుమంత్, మునిరాజులు, హరికృష్ణా తదితరులు ఉన్నారు. యువతకు అండగా ఉండి తన వంతు సహాయ సహకరాలు అందిస్తానని భరత్ హామీ ఇచ్చారు.

ఆ బలవంతపు టీడీపీ కండువా నాకొద్దు

పలమనేరు: పట్టణంలోని 22 వార్డుకు చెందిన రంగప్ప అలియాస్ గండన్న శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పలమనేరులో జరిగిన సభలో తనను టీడీపీ వారు ప్రలోభాలకు గురిచేసి ఆ పార్టీ కండువాను బలవంతంగా వేయించారని తెలిపారు. అయితే తనకు కనువిప్పుకలిగి మళ్లీ సొంత పార్టీ అయిన వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ జాఫర్, హయాత్, ముజ్జు తదితరులు ఉన్నారు.



పలమనేరులో సొంతగూటికి చేరుకున్న రంగప్ప

కాణిపాకం భక్తసంద్రం

కాణిపాకం (చిత్తూరు రూరల్): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. వరుస సెలవుల నేపథ్యంలో ఆలయం భక్తజనసంద్రంగా మారింది. ఉదయం నుంచే రద్దీగా కనిపించింది. క్యూలన్నీ నిండిపోయాయి. స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ అధికారులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శీఘ్ర దర్శనం కల్పించారు.



భక్తులతో నిండిన క్యూలు

ఆ శివుని సాక్షిగా!



పలమనేరు శివాలయంలో ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- నేను ఎలాంటి అక్రమాలు చేయలేదు
- కమీషన్లు తీసుకుంది మాజీ మంత్రి అమరన్నే
- ఆయన తీసుకుంది నిజం కాబట్టే ప్రమాణం చేసేందుకు రాలేదు
- పలమనేరు శివాలయంలో ప్రమాణం చేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: 'ఆ శివుని సాక్షిగా.. చంద్రబాబు, అమరనాథ్‌రెడ్డి ప్రజాగళం సభలో విమర్శించినట్లు నేనెంటువంటి అక్రమాలు, కమీషన్లు వసూలు చేయలేదు' అని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ శుక్రవారం పట్టణంలోని శివాలయంలో ప్రమాణం చేశారు. గురువారం ఆయన సవాల్ విసిరినట్టుగానే శివాలయానికి శుక్రవారం ఉదయం పది గంటలకే చేరుకున్నారు. తాను ఎలాంటి అక్రమాలు చేయలేదన్నారు. తమవారి వద్దే ఈ ప్రభుత్వం అందించిన బిల్లుల్లోనూ మాజీ మంత్రి అమర్ 10 శాతం కమీషన్ తీసుకున్నారని స్పష్టం చేశారు. ఆపై శివుని సాక్షిగా అంటూ.... శివాలయానికి సంబంధించిన ఆస్తులు, ఇసుక రవాణా, కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు తాను తీసుకోలేదని, తానేమైనా తప్పులు చేసుంటే ఆ దేవుడు వేసే శిక్ష తప్పదన్నారు. ఆయన మంత్రిగా ఉన్నప్పుడు చేసిన పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన బిల్లులోనూ 10 శాతం కమీషన్ తీసుకున్నారని, ఇందుకు సంబంధించి మొత్తం ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. ఆయనకు కమీషన్ తీసుకోలేదని దమ్ముంటే ప్రమాణం చేయాలని అక్కడే కొంతసేపు వేచి ఉన్నారు. కానీ ఎమ్మెల్యే సవాల్‌ను పక్కనబెట్టిన మాజీ మంత్రి ఆలయానికి రాలేదు. కేవలం ఎన్నికల్లో టీడీపీ లబ్ధిపొందేందుకు తనపై చంద్రబాబు లేనిపోని విమర్శలు చేశారని తెలిపారు. భవిష్యత్‌లో మాజీమంత్రి ఇలాంటి తప్పుడు విమర్శలు మళ్లీ చేయరాదని, అందుకు ఈ దేవుడే ఆయనకు మంచి బుద్ధిని ప్రసాదించాలని వేడుకున్నారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జాఫర్, మాజీ కన్వీనర్ మండీసుధా, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, మండల కన్వీనర్ బాలాజీనాయుడు, ఆస్పత్రి చైర్మన్ చెంగారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్లు రహీంఖాన్, రవి, శివాలయ కమిటీ చైర్మన్ వీరభద్ర, ప్రహ్లాద, కౌన్సిలర్లు కోదండరామయ్య, రాజేష్, శ్యామ్, హైదర్, రఘు, నయాజ్, జగ్గ, మొహిదీన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కోర్సులతో ఉజ్వల భవిత

- ఏప్రిల్ 27వ పాలిసెట్ దరఖాస్తు
- గడువు 31



పాలిసెట్‌పై అవగాహన కల్పిస్తున్న విశ్వనాథరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎస్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో శుక్రవారం పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ అవగాహన సదస్సు, పాలిసెట్ నమూనా ప్రవేశ పరీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్‌లో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, మైనింగ్, కెమికల్, బయో మెడికల్, త్రీడీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, పెట్రోలియం, టెక్స్‌టైల్స్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఇండస్ట్రీ ఇంటిగ్రేటెడ్), మెకానికల్ రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిడ్ కండిషనర్, డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, షుగర్ టెక్నాలజీ వంటి డిప్లొమో కోర్సులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పాలిటెక్నిక్ డిప్లొమో అనంతరం ప్రవేశ పరీక్ష ద్వారా నేరుగా ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందవచ్చన్నారు. పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో లభిస్తుందని, అలాగే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో డిప్లొమో పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 27వ తేదీ పాలిటెక్నిక్ పాలిసెట్ ప్రవేశ పరీక్షను రాష్ట్ర వ్యాప్తంగా సాంకేతిక విద్యా శాఖ నిర్వహించనుందని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు.

హోటల్ యజమాని ఆత్మహత్య



మృతి చెందిన తిలక్

పుంగనూరు: కుటుంబ కలహాల కారణంగా పట్టణంలోని కొత్తపేటలో శుక్రవారం హోటల్ యజమాని తిలక్ (55) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ సుబ్బారెడ్డి కథనం.. తిలక్‌కు ఓ కుమార్తె ఉండగా గతంలోనే ఆమెకు వివాహం చేశారు. ఆపై కుమార్తె, అల్లుడి మధ్య వివాదాల కారణంగా కుమార్తె పుట్టింటికి చేరింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన తిలక్ వేకువజామున ఇంటి నుంచి వెళ్లి స్థానిక మార్కెట్ కమిటీ వద్ద గల చెట్టుకు ఉరివేసుకుని తనువు చాలించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ఇదిలావుండగా 1983 పూర్వపు విద్యార్థులు తమ మిత్రుడు తిలక్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

మద్యం విక్రేత అరెస్ట్

గంగవరం: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని గంగవరం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. సీఐ చిన్నగోవింద్ కథనం.. మండలంలోని పలమనేరు–బెంగళూరు జాతీయ రహదారిలోని పసుపత్తూరు క్రాస్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో బేటనూరు నుంచి పసుపత్తూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని అనుమానం వచ్చి ఆపారు. వాహనంలో మూడు మద్యం కేసులు(టెట్రా ప్యాకెట్లు) ఉన్నట్టు గుర్తించారు. ఆపై కురప్పల్లి గ్రామానికి చెందిన ప్రకాష్‌బాబు అలియాస్ పెదరాజును పోలీసులు అదుపులోకి తీసుకుని మద్యం కేసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్ – ఇందులో ఓ పోలీస్ కానిస్టేబుల్ కూడా..

కార్వేటినగరం: ఓ కానిస్టేబుల్‌తోపాటు తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన సంఘటన మండల పరిధిలోని కొల్లాగుంట పంచాయతీ, బట్టువారిపల్లి సమీపంలోని మామిడితోటలో శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ సత్యబాబు కథనం.. బట్టువారిపల్లి సమీపంలోని ఓ మామిడి తోటలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ వెంకటక్రిష్ణ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఆపై అక్కడ పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా.. పళ్లిపట్టు గ్రామానికి చెందిన సైమన్, మరో వ్యక్తి పరారయ్యారు. మిగిలిన 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 5 లక్షల 26 వేల రూపాయల నగదు, 11 సెల్‌ఫోన్లు, ఎఫ్‌జెడ్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందులో తిరుపతి పట్టణం, ముత్యాలరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఐడీ పార్టీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పూర్ణచంద్రరావు పేకాటలో పట్టుబడినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో ఎస్కే.రాజారావు, పాండన్స్, ఎస్.మోహన్, ఎం.గుణశేఖర్, టీ.దిలీప్, టీ.గణేషన్, డీ.సురేష్, కే.రవిశంకర్ ఉన్నారు. వీరిలో ముగ్గురు ఆంధ్రాకు చెందిన వారుకాగా మిగిలిన వారు తమిళనాడు రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. ట్రైనీ డీఎస్పీ పావన్‌కుమార్, ఎస్‌ఐ వెంకటక్రిష్ణ, ఏఎస్‌ఐ మునికృష్ణ, సిబ్బంది రాజశేఖర్, మురళీకృష్ణంరాజు, కుబేరన్, మోహన్ పలువురు పాల్గొన్నారు.

ఏప్రిల్ 6 నుంచి వార్షిక పరీక్షలు



చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో 1 నుంచి తొమ్మిదో తరగతి వరకు వార్షిక పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి ప్రారంభం కానున్నాయి. 1 నుంచి 5 తరగతులకు ఏప్రిల్ 6 నుంచి 16వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే 6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఏప్రిల్ 6 నుంచి 19వ తేదీ పరీక్షలు జరుగుతాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ విధానంలో, 9వ తరగతికి సీబీఎస్‌ఈ విధానంలో పరీక్షలు ఉంటాయి. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మాత్రం పాత విధానంలోనే నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 2,874 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,466 ప్రభుత్వ యాజమాన్య పరిధిలో, 408 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,33,925 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ప్రశ్నపత్రాల పంపిణీకి చర్యలు

మండల విద్యాశాఖ కార్యాలయాలకు ప్రశ్నపత్రాలను చేర్చే పనిలో జిల్లా కామన్ ఎగ్జామ్ బోర్డు(డీసీఈబీ) నిమగ్నమైంది. ఈనెల 30వ తేదీ నాటికి మండల కేంద్రాలకు ప్రశ్నపత్రాలను పూర్తి స్థాయిలో పంపించే అవకాశం ఉంది. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వాటిని సరి చూసుకుని ఎమ్మార్సీలో భద్రపర్చుకోవాలి. పరీక్షల ప్రారంభం నుంచి సంబంధిత ప్రశ్నపత్రాల బండిళ్లను ఏరోజుకారోజు పరీక్షకు గంట ముందు ఎమ్మార్సీల నుంచి హెచ్‌ఎంలు తీసుకెళ్లాల్సి ఉంటుంది.

టైం టేబుల్ విడుదల

పరీక్షల నిర్వహణకు ఎస్‌సీఈఆర్‌టీ టైమ్ టేబుల్ విడుదల చేసింది. పరీక్షల నిర్వహణ అనంతరం ఏప్రిల్ 21వ తేదీలోగా జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి ఫలితాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు సూచించారు. ఏప్రిల్ 23న ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు అందజేయడంతో పాటు తరగతి వారీగా ప్రమోషన్ జాబితాలు సిద్ధం చేసేందుకు కసరత్తు నిర్వహిస్తున్నారు.

ఒకటి నుంచి ఐదు తరగతులకు..

1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ఏప్రిల్ 6న తెలుగు, 8న ఇంగ్లిషు, 10న ఇంగ్లిష్ పార్ట్–బీ (టోఫెల్), 12న గణితం, 13న పరిసరాల విజ్ఞానం పరీక్షలు నిర్వహిస్తారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానమైన పరీక్షలు ఏప్రిల్ 13తో ముగుస్తాయి. 15న ఓఎస్ఎస్‌సీ, 16న 4వ తరగతి విద్యార్థులకు మాత్రం స్టేట్ లెవల్ ఎచీవ్‌మెంట్ సర్వే (స్లాష్) పరీక్షను నిర్వహించనున్నారు.

ఆరు నుంచి తొమ్మిది తరగతులకు

6 నుంచి 9 తరగతుల విద్యార్థులకు ఏప్రిల్ 6న తెలుగు, 8న హిందీ, 10న ఇంగ్లిషు పార్ట్–ఏ, 12న ఇంగ్లిషు పార్ట్–బీ (టోఫెల్), 13న గణితం, 15న ఒకటి నుంచి ఎనిమిది తరగతులకు జనరల్ సైన్స్, 9వ తరగతికి ఫిజికల్ సైన్స్, 16న బయలాజికల్ సైన్స్, 18న సోషల్ స్టడీస్, 19న 8, 9 తరగతులకు కాంపోజిట్ కోర్సులు/ ఓఎస్ఎస్‌సీ1 అండ్ 2 పరీక్షలు, అదే రోజు 6, 7 తరగతులకు పేపర్–1, పేపరు–2 పరీక్షలు నిర్వహిస్తారు.

పకడ్బందీగా పరీక్షలు

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపడుతున్నాం. పరీక్షా పత్రాల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశాం. పరీక్షలు రాతపూర్వక విధానంలోనే నిర్వహిస్తున్నాం. ఎస్‌సీఈఆర్‌టీ నిబంధనల ప్రకారం పరీక్షలను పాఠశాల స్థాయిలో పక్కాగా నిర్వహించాలి.

– హేమారెడ్డి, డీసీఈబీ సెక్రటరీ, చిత్తూరు